వైభవంగా లక్ష్మీనరసింహుని తెప్పోత్సవం - 7లో



ద్వారపూడిలో బేస్‌మెంట్ స్థాయి దాటని పనులు



మండపేట గౌతమి పాఠశాలలో నిలిచిపోయిన పనులు

నాడు నేడూ → ఇలాగే

నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు

మండపేట, ఫిబ్రవరి 25: 'నాడు-నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశాం... విద్యా రంగంలో నూతన విధానాలు అమలు చేస్తున్నాం.' అంటూ సీఎం జగన్ చేస్తున్న ప్రచారానికి పాఠశాలల్లో నేడు జరుగుతున్న పనులకు పొంతన ఉండట్లేదు. మండపేట పట్టణంతో పాటు రూరల్‌లో 500 సిమెంటు బస్తాలు గడ్డకట్టి పనికి రాకుండా పోయాయని మండల విద్యాశాఖాధికారి తెలిపారు. వాటిని పాఠశాలల నుంచి తొలగించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండపేట పట్టణంలో రూ.3.78 కోట్లతో 13 పాఠశాలల భవనాల నిర్మాణం చేపట్టారు. కానీ నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. మండపేట మండలంలో 52 పాఠశాలలకు రూ.11 కోట్లు మంజూరయ్యాయి. అందులో కేవలం 22 భవనాల పనులు చేపట్టి నిధుల లేమితో అర్ధంతరంగా వదిలేశారు. ఈ కారణంగా విద్యార్థులు అరకొర వసతుల నడుమ చదువుకోవాల్సి వస్తోంది. మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలోని చిన ద్వారపూడిలో ఎంపీపీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో దానిని కూల్చివేసి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. పాఠశాల భవనం లేక గ్రామంలో రామాలయం వెనుక వున్న కమ్యూనిటీ హాలులో పది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో 1 నుంచి 5 తరగతుల వరకు ఒకే గదిలో ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తోంది. మధ్యలో నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



మండపేట గొల్లపుంత పాఠశాలలో విద్యార్థుల వెనుక గడ్డకట్టిన సిమెంటు బస్తాలు



చినద్వారపూడిలో నిధుల కొరతతో నిలిచిపోయిన పనులు



వైభవంగా సత్తెమ్మ తల్లి జాతర

విశేషంగా ఆకర్షిస్తున్న విద్యుద్దీపాలంకరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25: మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల సమతానంద దుర్గా మహా పీఠాధిపతి శ్రావణ చైతన్యానంద చినస్వామి ప్రవచనాలు జరిగాయి. ఉదయం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సుమారు రూ.23 లక్షలతో ఏర్పాటుచేసిన అమ్మవారి ఆలయ ఆకృతి, అయోధ్య రామమందిరం ఆకృతిలో విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిపాల చెరువు, పల్లంకుర్రు రోడ్డులో మిరుమిట్లు గొలిపే స్వాగత ద్వారాలు, లక్ష్మీదేవి, దుర్గాదేవి, త్రిమూర్తులు తదితర దేవతామూర్తుల ఆకృతులు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బాజాభజంత్రీలు, గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.









కోటిపల్లి రేవులో పంటు కోసం అభ్యర్థుల నిరీక్షణ

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

జిల్లావ్యాప్తంగా 9,195 మంది హాజరు... కోటిపల్లి, ముక్తేశ్వరం రేవుల్లో అభ్యర్థుల పాట్లు

అమలాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలకు అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. అయితే రామచంద్రపురం కేంద్రంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో ఒకే టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేయడంతో పరీక్షకు హాజరయ్యే వందలాది మంది అభ్యర్థులతో పాటు ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 9 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉంది. అయితే సకాలంలో పరీక్షా కేంద్రానికి వెళ్లగలమా లేదా అని అభ్యర్థులు మానసిక వేదన అనుభవించారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్షలకు 32 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10,788 మందికి 1,593 మంది గైర్హాజరు కాగా 9195 మంది హాజరైనట్టు కలెక్టర్ కార్యాలయం తెలిపింది. 85.23 శాతం హాజరు నమోదైందని జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ తెలిపారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణతీరును ఆమె పరిశీలించారు. అభ్యర్థులు ఎటువంటి భయాందోళనలకు లోనుకాకుండా సమయపాలన పాటిస్తూ సూటిగా జవాబులు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆమె ఆకాంక్షించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ కె.వెంకటరమణ, రావులపాలెం రూరల్ సీఐ రామ్‌కుమార్, కొత్తపేట ఎస్ఐ జి.అశోక్ ఉన్నారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలను అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.





ముక్తేశ్వరం-కోటిపల్లి రేవు వద్ద పంటు కోసం వేచి వున్న గ్రూప్-2 అభ్యర్థులు, ప్రయాణికులు



అయినవిల్లి మండలం ముక్తేశ్వరం పాలిటెక్నికల్ కళాశాలలో పరీక్ష తీరు తెన్నులను పరిశీలిస్తున్న జేసీ నుపూర్‌అజయ్



కొత్తపేటలో పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

ఆఖరు నిమిషంలో పోలీసుల సహకారంతో పరీక్షా కేంద్రానికి...

ద్రాక్షారామ, ఫిబ్రవరి 25: గ్రూప్-2 పరీక్షకు రామచంద్రపురం మండలంలోని కేంద్రానికి బదులు పట్టణంలోని కేంద్రానికి చేరుకుంది ఓ అభ్యర్థిని. పోలీసులు సకాలంలో స్పందించి అసలు పరీక్షా కేంద్రానికి చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.... గ్రూప్ అభ్యర్థిని రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారంలోని కిట్స్ ఇంజనీరింగ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఆమె పొరపాటున పట్టణంలోని వీఎస్‌ఎం కళాశాలలోని కేంద్రానికి వెళ్లింది. అక్కడ పరిశీలనలో భాగంగా సెంటరు కోడ్‌ను చూసిన పోలీసులు కేంద్రం తప్పిపోయినట్టు గుర్తించారు. కొద్ది నిమిషాల సమయం మాత్రమే ఉండడంతో ఆమె ఆందోళనకు గురైంది. అక్కడే వున్న డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు వెంటనే స్పందించారు. లోవరాజు అనే కానిస్టేబుల్‌తో అభ్యర్థిని మోటారు సైకిలుపై అంబికపల్లి కేంద్రానికి పంపించారు. ఆఖరు నిమిషంలో చేరుకుని పరీక్ష రాసింది. వెంటనే స్పందించిన పోలీసులను పలువురు అభినందించారు.



రైతుల నుంచి చేపలు కొనుగోలు చేసి రూ.కోటికి పైగా టోకరా

ఇద్దరు నిందితుల అరెస్టు

అమలాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి అధిక మొత్తంలో చేపలు కొనుగోలు చేసి రూ.కోటికిపైగా టోకరా వేసి పరారీలో ఉన్న ఒడిసాకు చెందిన నిందితులను అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో చాకచక్యంగా అరెస్టు చేసినట్టు అమలాపురం తాలూకా సీఐ పి.వీరబాబు ఆదివారం తెలిపారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామానికి చెందిన పినిశెట్టి బాబి అల్లవరం మండలంలో ఆక్వా సాగు చేపట్టాడు. అతడితో పాటు పరిసర ప్రాంతాల రైతుల నుంచి ఒడిసాకు చెందిన చందన్‌కాలసి, సంజయ్‌కాలసి అధిక మొత్తంలో చేపలు కొనుగోలు చేశారు. రైతులకు రూ.కోటికి పైగా సొమ్ము చెల్లించకుండా పరారయ్యారు. బాబి ఇచ్చిన ఫిర్యాదుపై అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ కేసు నమోదుచేసి సీఐ వీరబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఒడిసాలో ఉన్న నిందితులను అల్లవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారి వద్దనున్న ఆడి కారును సీజ్ చేశారు. చందన్‌కాలసి, సంజయ్‌కాలసిలను అమలాపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించినట్టు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ హరీష్‌కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీ జేఏసీ 'చలో విజయవాడ'కు అనుమతులు లేవు: ఎస్పీ శ్రీధర్



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: ఏపీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని ఎస్పీ ఎస్.శ్రీధర్ వెల్లడించారు. ఉద్యమ శంఖారావంలో భాగంగా ఏపీ జేఏసీ ఇచ్చిన 'చలో విజయవాడ'కు కమిషనర్ ఆఫ్ పోలీస్ అనుమతి లేనందున ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు. అనుమతులు లేని కార్యక్రమాల్లో పాల్గొంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. విజయవాడ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో సెక్షన్-30 పోలీసు యాక్టు, సెక్షన్ 144 సీఆర్పీసీ అమలులో ఉన్నందున 'చలో విజయవాడ'లో అసాంఘిక శక్తులు ఆందోళనలో చేరి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారన్నారు.

నేడు 'స్పందన'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు తమ సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.

28న రాజమహేంద్రవరంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న రాజమహేంద్రవరంలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కోనసీమ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. రాజమహేంద్రవరం వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ ఆవరణలో సుమారు వంద కంపెనీల్లో పనిచేసేందుకు, 4వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలుగా జాబ్‌మేళా జరుగుతుంది. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన యువత ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు.రూ.10వేల నుంచి రూ.25వేల వరకు జీతంతో పాటు ఇంటెన్సివ్ అందిస్తారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్ ఐడీ, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు చక్రధర్‌ను 9603161039, బాబును 9676052454 నెంబర్లలో సంప్రదించాలని లోకమాన్ కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని తెప్పోత్సవం



పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ముగిసిన అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు
- చివరి రోజు హంస వాహనంపై విహరించిన స్వామివారు
- ఘనంగా శ్రీపుష్పోత్సవం



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అంతర్వేది, ఫిబ్రవరి 25: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం స్వామివారిని పుష్పక వాహనంపై ఊరేగించారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి అనంతరం దేవస్థానం చెరువుగట్టు వద్దకు తీసుకువచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని చెరువులో ఉన్న హంస వాహనంపై కొలువుదీర్చి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెప్పోత్సవ నిర్వహణ విరాళ దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజా బహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి తిరుమంజనములు, దర్పణ సేవ, ధూప సేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీ పుష్పయాగోత్సవం, చెంగోళ విన్నపం, తీర్థగోష్టి నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.



పుష్పోత్సవం నిర్వహించిన దృశ్యం

ఘనంగా శ్రీపుష్పోత్సవం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన స్వామివారి శ్రీపుష్పోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఆలయంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ తిరువరాధన పూజా కార్య క్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో స్వామివారికి ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగోల విన్నపం, తీర్థగోష్టి, అనంతరం శ్రీస్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్య నారాయణ, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నయనానందకరం

భీమేశ్వర స్వామివారి తెప్పోత్సవం



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



ద్రాక్షారామ, ఫిబ్రవరి 6: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భీమేశ్వర స్వామి వారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి 7.05 గంటలకు కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వార్లను మంగళ వాయిద్యాల నడుమ సప్తగోదావరిలో విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకృతమైన హంస వాహనం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం కల్యాణమూర్తులను హంసవాహనంపై కల్యాణ బ్రహ్మలు అధిష్ఠింపజేశారు. వేద పండితులు బులుసు రామకృష్ణ బృందం ముందుగా స్వామివారికి ఆస్థాన పూజ జరిపారు. అనంతరం కల్యాణ మూర్తులకు నీరాజన మంత్ర పుష్పములు సమర్పిస్తుండగా మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారు సప్తగోదావరి నదిలో జలవిహారం చేశారు. భీమేశ్వరుని జలవిహారం సప్తగోదావరి ఒడ్డుకు చేరుకోగా భక్తులు తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని రథోత్సవం



అన్నవరం, ఫిబ్రవరి 25: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మాఘపు ఆదివారం పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. అయితే ప్రతి ఆదివారం రథోత్సవం నిర్వహించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దీనిని ఆర్జిత సేవగా పెట్టాలని భావిస్తున్నారు. వచ్చే నెలలో జరిగే పాలక మండలి సమావేశంలో దీనిపై చర్చించి దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో తుది చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.

హోరాహోరీగా..

సామర్లకోటలో ఖోఖో పోటీలు



ఖోఖో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో 56వ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య ఆదివారం హోరాహోరీగా జరిగాయి. ఖోఖో పోటీల నిర్వాహకులు కె.పట్టాభిరామం, ఊబా జాన్ మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విశాఖ-గుంటూరు మధ్య జరిగిన పోటీలలో 10-3 స్కోరు తేడాతో విశాఖ విజయం సాధించింది. కృష్ణా-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో 9-1 స్కోర్ తేడాతో కృష్ణా జట్టు విజయం సాధించింది. ప్రకాశం-కర్నూలు మధ్య జరిగిన పోటీలో 15-3 పాయింట్ల తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా-పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి జట్టు 5-3 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కడప- అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీలో కడప జట్టు విజయం సాధించింది. విశాఖ-నెల్లూరు మధ్య జరిగిన పోటీలో నెల్లూరు జట్టు 5-9 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కృష్ణా- చిత్తూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణ జట్టు 11-4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ప్రకాశం-విజయనగరం జట్ల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం జట్టు 13-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలను తిలకించేందుకు ప్రముఖులు, పలువురు క్రీడాకారులు హాజరయ్యారు.

సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధికి నేడు శ్రీకారం



సామర్లకోట, ఫిబ్రవరి 25: కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రూ.25.37 కోట్లతో చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి దేశ వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టనున్న అమృత్‌భారత్ స్టేషన్ పథకం పనులను జాతికి అంకితం చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్‌లో పథకంలో సామర్లకోట రైల్వే స్టేషన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఈ నిధులతో సామర్లకోట స్టేషన్ ప్లాట్‌ఫాం విస్తరణ, అభివృద్ధి, ప్లాట్‌ఫాంల సుందరీకరణ పనులు, టాయిలెట్స్ అభి వృద్ధి పనులు, వెయిటింగ్ హాలు అభివృద్ధి, రెండో ఎస్కలేటర్, స్టేషన్ విద్యుద్దీకరణ, స్టేషన్ ఆవరణ బ్యూటిఫికేషన్ పనులను చేపట్టనున్నట్లు సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

భావనారాయణస్వామి ఆలయం కిటకిట

మాఘ ఆదివారం కావడంతో పోటెత్తిన భక్తజనం



ఆలయంలో పాలపొంగులు సమర్పిస్తున్న భక్తులు



ఆలయానికి పోటెత్తిన భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మాఘమాస తిరునాళ్లు వైభవోపేతంగా సాగుతున్నాయి. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా మూడో ఆదివారంతో పాటు భావనారాయణస్వామి జన్మదినం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల తాకిడిని దృష్టిని ఉంచుకుని ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి, స్వామివారిని మేలుకొల్పిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతించారు. భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఆలయ ప్రాంగణంలో ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేష శ్రీభావనారాయణస్వామిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాన్నం, పాలపొంగులు తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. స్వామివారి జన్మదినం కావడంతో తిరునాళ్లలో సుమారు 45 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో భీమశంకరరావు తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు స్వామివారిని దర్శించుకుని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చక్రధర్, వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ పోటీలు



స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా నిలిచిన శ్రేయకు ట్రోఫీ బహూకరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: అమలాపురం 2వ వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్-2024 పోటీలు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబుల నేతృత్వంలో జరిగాయి. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా ఎం.శ్రేయ(తణుకు), స్ట్రాంగ్ ఉమెన్స్ రన్నర్‌గా పి.వందన(అమలాపురం)లు నిలిచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. పవర్‌లిఫ్టింగ్ బార్‌ను ఎత్తి పోటీలు ప్రారంభించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 96 మంది వెయిట్ లిఫ్టర్లు హాజరయ్యారు. 9 విభాగాల్లో పోటీలు జరిగాయి. తొలుత మహిళా విభాగంలో నిర్వహించిన పోటీల విజేతల వివరాలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ప్రకటించారు. 66 కిలోల మహిళా విభాగంలో జి.సుభద్ర (మలికిపురం) ప్రథమ, యు.శశికళ (అమలాపురం) ద్వితీయ, ఎం.దుర్గ (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోలు పైబడిన విభాగంలో ఎం.శ్రేయ (తణుకు), పి.వందన (అమలాపురం), సీహెచ్ హారిక (రామచంద్రపురం) వరుస స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డీవీవీ సత్యనారాయణ, యు.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం(అమలాపురం) వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, డాక్టర్ గంధం విశ్వనాథ్, కౌన్సిలర్లు ఆశెట్టి నాగదుర్గ, యేడిద శ్రీను, కల్వకొలను బాబీ, ఆశెట్టి ఆదిబాబు, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెందూరి నాగేశ్వరరావు, తరెట్ల రాజేష్ తదితరులు విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కమిటీతో నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25: ఏపీజేఏసీ అమరావతి సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికలకు అసిస్టెంట్ రిజిస్ట్రారు, కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు స్వీకరించగా గడువు ముగిసే సమయానికి తొమ్మిది పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లా సంఘ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడిగా సవరపు చినపాపారావు (కరప ఎంఆర్‌వో ఆఫీస్), సహాధ్యక్షుడిగా వాసంశెట్టి దుర్గాప్రసాద్(కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్), ఉపాధ్యక్షులుగా ధర్మవరపు శ్రీనివాసరావు (అమలాపురం సివిల్ సప్లయిస్ ఆఫీస్), బాలిబోయిన గణేశ్వరరావు (పెద్దాపురం ఆర్‌డీవో ఆఫీస్), కార్యదర్శిగా ఖండవల్లి చంద్రశేఖర్ (మామిడికుదురు బాయ్స్ హాస్టల్), సంయుక్త కార్యదర్శులుగా మానుపాటి వరలక్ష్మి (అమలాపురం ఆర్‌డీవో ఆఫీసు), తోటకూర శ్రీనివాస్ (రామచంద్రపురం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొరవాడ దుర్గాప్రసాద్ (కాకినాడ ఎంప్లాయిమెంట్ ఆఫీస్), కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ (కాకినాడ జిల్లా కలెక్టర్ ఆఫీస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారం నూతనంగా ఎన్నికైన కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు, కార్యదర్శి ఎస్ఎస్‌కే దుర్గాప్రసాద్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యవర్గం మూడేళ్ల కాలం పాటు కొనసాగుతుందని సంఘం ప్రతినిధులు తెలిపారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు రానున్న కొత్త కళ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైల్వే స్టేషనుగా రాజమండ్రి రైల్వే స్టేషను మెరుగుపడనుంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం దేశ వ్యాప్తంగా ఎంపికైన స్టేషన్ల కోసం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని సామర్లకోట, అనపర్తి, రాజమండ్రి ఉన్నాయి. ప్రజలు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని తిలకించడానికి వీలుగా రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో స్ర్కీన్లు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలకు వేదిక తదితర ఏర్పాట్లను ఒకటో ప్లాట్‌ఫాం చివరన రైల్వే అధికారులు పూర్తి చేశారు. నిబంధనలను అనుసరించి ఇప్పటికే ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వి.కల్యాణ్‌కుమార్‌ని రైల్వే నియమించింది. ఉదయం 10.30 గంటల నుంచే వివిధ కార్యక్రమాలు ప్రారంభం కాగా 12.30 గంటల సమయంలో ప్రధాని వర్చువల్ విధానంలో శంకుస్థాపన నిర్వహిస్తారు. అమృత్ భారత్ స్టేషన్‌గా చేసే అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు ఉన్న రైల్వే స్టేషను రూపు రేఖలను రూ.214 కోట్లతో పూర్తిగా మార్చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పిస్తారు. అయితే ప్రయాణికుల రాకపోకల రీత్యా కీలకమైన ఆరో ప్లాట్‌ఫాం నిర్మాణంపై స్పష్టత లేదు. అలాగే ఇదే కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరిలోని లక్ష్మీపురం-ఎస్‌హెచ్ 16 (తుని రైల్వేస్టేషను సమీపంలో), మాదాపురం-పిఠాపురం, గోర్స-పిఠాపురం (పిఠాపురం), చేపూరు-ఎస్‌హెచ్16 (హంసవరం), కాల్దరి-వేలివెన్ను, వేలివెన్ను-శెట్టిపేట(కాల్దరి), శెట్టిపేట గ్రామంలో(నిడదవోలు)ని రైల్ అండర్‌పాస్ బ్రిడ్జిలను కూడా ప్రధాని మోదీ జాతికి అంకితం చేస్తారు.

లోవలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, ఫిబ్రవరి 25: తలుపులమ్మ లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే భక్తులు తరలివచ్చారు. లోవకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన షెడ్‌లతో పాటు వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తుల రద్దీని పర్యవేక్షించారు. వివిధ విభాగాల ద్వారా రూ.3.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్సీ కవిత



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: ముంగండ శ్రీముత్యాలమ్మవారి దయతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ప్రగతిపథంలో ముందుకు సాగే విధంగా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. కవితకు నన్నయ యునివర్సిటీ న్యాయాధికారి నందెపు నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మితో కలిసి పూజలు నిర్వహించారు. అదే విధంగా అయినవిల్లి విఘ్నేశ్వరుడు, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాలు, ప్రసాదాలను కవితకు అందించారు. అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు కొమ్ముల సూరిబాబు అప్పనపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందించారు. ఆలయ అర్చకులు సోమయాజులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.

హాకీ మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు సభ్యులు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 25; మార్చి 8 నుంచి 19 వరకు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగే అంతర్ జిల్లాల మహిళా హాకీ పోటీలకు ఆదివారం ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక జిల్లా క్రీడా మైదానంలో జరిగింది. 32మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు వి.రవిరాజు, నాగేంద్రకుమార్, సభ్యులు రాజారమేష్, కిరణ్ పాల్గొన్నారు.

కిత్తనచెరువులో వైసీపీ జెండా తొలగింపు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25: కిత్తనచెరువు పంచాయతీ సీతారామపురంలో శనివారంరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వైసీపీ జెండాను కర్రతో సహా విరిచి పంట కాల్వలో పడేశారు. దీనిపై పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిల్లా లక్ష్మణరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ కె.మనోహర్‌జోషీ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ పాలన టీడీపీకే సాధ్యం: వేగుళ్ల


బాబుష్యూరిటీ కార్యక్రమంలో వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో సంక్షేమ పాలన టీడీపీకే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. పడమరఖండ్రికలో ఆదివారం పార్టీశ్రేణులతో కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీపాలన అంతా దోపిడీలు, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలకే పరిమితమైందని, మచ్చుకైనా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే చంద్రబాబుకు సీఎంగా పట్టంకట్టాలన్నారు. గ్రామంలో ఇంటింటా పర్యటించిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి ప్రసాద్, పుత్సల శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, కొండేటి నాగేశ్వరరావు, కొమ్మిశెట్టి సుబ్బారావు, రాంబాబు, కవల కృష్ణ, మత్స గంగరాజు, అడపా అబ్బు, కాశీ, సాకా శ్రీను, వల్లూరు సుబ్బారావు, కె.సత్యనారాయణ, కరీం, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: పి.గన్నవరం డిప్యూటి తహసీల్దార్‌గా డి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు ఆయన సివిల్‌సప్లయిలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా శ్రీనివాస్ తహసీల్దార్ ఎస్‌కె హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటర్ విద్యార్థులకు నగదు అందజేత

మండపేట, ఫిబ్రవరి 25: స్థానిక విద్యా వికాస్ కళాశాలలో ఇంటర్‌లో అధ్యతిక మార్కులు సాధించిన ఎంపీసీ విద్యార్థి పామర్తి శ్యామలదేవికి, బైపీసీ విద్యార్థిని ఎస్.లక్ష్మీదీపికలకు మండపేట లయన్స్ క్లబ్ సభ్యులు రూ.20వేలు అందజేశారు. నగదును జిన్నూరి సాయిబాబా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు చెన్నా రాంబాబు, లయన్స్ సభ్యులు లక్ష్మీనాగేంద్ర, గుండు తాతరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు వర్రె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలతో గ్రామాల అభివృద్ధి

అల్లవరం, ఫిబ్రవరి 25: రోడ్ల నిర్మాణాలతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బోడసకుర్రు పంచాయతీ దేవర్లంక వద్ద సాపేవారికాలనీ రోడ్డు నిర్మాణానికి మంత్రి స్థల పరిశీలన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, చెల్లుబోయిన శ్రీనివాస్, సంసాని నాని, సాపే ధర్మరాజు, గోసంగి వెంకటేశ్వరరావు, బొంతు శ్యామ్, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

అల్లవరం, ఫిబ్రవరి 25: గోడి ప్రభుత్వ బాలురు, బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్‌పరీక్షలు రాసే విద్యార్థులు షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం పరీక్ష కిట్లు పంపిణీ చేసింది. అధ్యక్షుడు యు.నరసింహరావు, బత్తుల నకులరాజు, జె.లోవరాజు, ఎం.రాజేష్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, జానీ పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వరస్వామి పుష్పోత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి 25: మాచవరం శివారు కోళివారి అగ్రహారం గ్రామంలో కొలువతీరిన శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను పూలతోసర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అర్చకుల వసతిగృహానికి విరాళం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన అర్చకుల వసతిగృహ సముదాయానికి పట్టణానికి చెందిన పాబోలు వెంకటనరసింహారావు(రాజా)-సుభద్రాదేవి దంపతులు రూ.50వేలు విరాళంచెక్కును దేవస్థానం చైర్‌పర్సన్ దూడల విరీతాదేవికి అందజేశారు. యెండూరి నాగేశ్వరరావు, దూడల ఫణి పాల్గొన్నారు.

బుచ్చిబాబు, వేగుళ్లకు అభినందనల వెల్లువ

మండపేట, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావును పేరు ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం వేగుళ్లను పార్టీ శ్రేణులు, అభిమానులు వచ్చి పూలమాలలతో సత్కరించారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ శ్రేణులు, నాయకులు, అభిమానులు మండపేట పార్టీ కార్యాలయానికి చేరుకుని వేగుళ్లకు అభినందనలు తెలిపారు. పలువురు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్వీట్స్ తినిపించి ఆనందాన్ని వేగుళ్లతో పంచుకున్నారు. నాల్గవసారి వేగుళ్లను భారీ మెజార్టీతో గెలిపిస్తామని టీడీపీ శ్రేణులు చెప్పారు.

బుచ్చిబాబుకు టికెట్ కేటాయింపుపై హర్షం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేన కూటమి ముమ్మిడివరం అభ్యర్థిగా దాట్ల బుచ్చిబాబును ప్రకటించడంతో మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద రెండు రోజులుగా సందడి నెలకొంది. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలంతో పండుగ వాతావరణం ఏర్పడింది. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి బుచ్చిబాబును అభినందించారు. టీడీపీ-జనసేన పొత్తును ప్రజలు కోరుతున్నారని బుచ్చిబాబు అన్నారు. తెలుగుదేశం-జనసేన ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో వైసీపీలో వణుకు ప్రారంభమైందన్నారు. చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, దొమ్మేటి రమణకుమార్, ధూళిపూడి బాబి, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, వెంటపల్లి ఉమామహేశ్వరి, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పితాని నరసింహమూర్తి, అధిక సంఖ్యలో అగ్నికులక్షత్రియ నాయకులు పాల్గొన్నారు.



వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల బుచ్చిబాబులకు అభినందనలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఫణీంద్ర



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బండారులంకకు చెందిన కాశిన ఫణీంద్రను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ ఆదివారం నియామక ఉత్తర్వులను అందజేశారు. యువమోర్చాలో మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వివిధ పదవులు నిర్వహించిన ఫణీంద్రను రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించడంతో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహా సంకల్ప యాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: జనసేన అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో మహా సంకల్ప యాత్రను 107వ రోజైన ఆదివారం పట్టణ పరిధిలోని నల్లా గార్డెన్స్‌లో నిర్వహించారు. కౌన్సిలర్ గొలకోటి విజయలక్ష్మితో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి జనసేన సిద్ధాంతాలను వివరించారు. శెట్టిబత్తుల వరలక్ష్మి, గండి దేవిహారిక, మట్టపర్తి సాయిబాబా, నందుల సత్తిబాబు, నల్లా సత్యవేణి, వర్రే నాగమణి, గొలకోటి హారిక పాల్గొన్నారు.

జిప్‌మెర్ ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాని మోదీ


మంత్రి జయకుమార్‌ను సత్కరిస్తున్న పుదుచ్చేరి జిప్‌మెర్ అధికారులు

యానాం, ఫిబ్రవరి 25: యానాంలో నిర్మించిన జిప్‌మెర్ కన్సల్టింగ్ యూనిట్‌ను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా రాజ్‌కోట నుంచి ఆదివారం ప్రారంభించారు. యానాంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు పుదుచ్చేరి నుండి ఆసుపత్రి అవరణలో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి వ్యవసాయశాఖ మంత్రి తేనేజయకుమార్, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. యానానికి జిప్‌మెర్ ఆసుపత్రి తీసుకురావడానికి మల్లాడి చేసిన కృషిని అతిథులు వివరించారు. పరిపాలనాదికారి మునిస్వామి, పుదుచ్చేరి నుంచి వచ్చినసూపరింటెండెంట్ దొరైరాజు, యానాం జిప్‌మెర్ ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనందరాజ్, సూపరింటెండెంట్ పార్వతీ పాల్గొన్నారు. జిప్‌మెర్‌యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంపై పేర్లు లేకపోవడంతో మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి అసహనం వ్యక్తంచేశారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు


అల్లవరం: ఓడలరేవు బీవీసీ కళాశాల వద్ద గ్రూప్-2 పరీక్షలకు బారులు తీరిన అభ్యర్థులు

రాయవరం: రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాయవరంలో 432మంది అభ్యర్థులకు 323మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. తహశీల్దారు ఆర్‌వీ కృష్ణారావు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం వద్ద మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పి.గన్నవరం: పి.గన్నవరంలోని గ్రేస్ డిగ్రీ కళాశాల, లక్ష్మీఐటీఐ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 700మంది అభ్యర్థులకు 615మంది హాజరైనట్లు రూట్‌ఆఫీసర్ డీఎస్‌వో పాపారావు తెలిపారు. పరీక్షలను లైజనింగ్ అధికారులు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, వ్యవసాయశాఖ అధికారులు సూర్యకళ్యాణ్, సీహెచ్‌డీ విజయకుమార్ పర్యవేక్షించారు.

మండపేట: మండపేట ఆదిత్య జూనియర్ కళాశాల, మారేడుబాక డిగ్రీ కళాశాల, ఆలమూరు- మండపేట రోడ్డులోవున్న విజ్ఞాన్ కళాశాలల్లో గ్రూపు-2 పరీక్షలు ఆదివారం నిర్వహించారు. 850మంది అభ్యర్థులకు 699 మంది పరీక్షకు హాజరయ్యారు. పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి పర్యవేక్షణలోబందోబస్తు నిర్వహించారు. పరీక్షలను రామచంద్రపురం డీఎల్‌డీవో శాంతి, తహసీల్దార్ సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.రాము, మండపేట మండల అభివృద్ధి అధికారిణి కె.శ్రీదేవి పర్యవేక్షించారు.

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షలకు 710మంది హాజరయ్యారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో బీవీసీ పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మలికిపురం: మలికిపురం ఏఎఫ్‌డీటీ ప్రాంగణంలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. 700మంది అభ్యర్థులకు 607మంది హాజరైనట్టు తెలిపారు. ఏర్పాట్లను ప్రిన్సిపాల్ టి.సతీష్, ఎం.సత్యనారాయణమూర్తులు పర్యవేక్షించారు.

అపూర్వ కలయిక



రామచంద్రపురం, ఫిబ్రవరి 25: రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ ఉన్నత పాఠశాలలో 1973-74 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ 50ఏళ్ల పండుగను జరుపుకున్నారు. స్థానిక కొత్తూరు రోడ్‌లో గల శ్రీసత్యజయ ఫంక్షన్ హాల్‌లో కలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. కొంత సమయం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. అనంతరం వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతీ ఏడాది కలవాలని నిర్ణయించుకున్నారు. మేడిశెట్టి సత్యనారాయణ, యేరుకొండ రామారావు, కె.ప్రసాద్, బాల తమ్మిరాజు, ముసునూరి ప్రసాద్‌కనకాల వెంకటేశ్వరరావు, ఉండమట్ల వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

కొత్తపేట సీటుపై పునరాలోచించమని పవన్‌ను కోరదాం


మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్

రావులపాలెం, ఫిబ్రవరి 25: కొత్తపేట అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో పునరాలోచించమని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కోరదామని ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రావులపాలెంలోని కాపు కల్యాణ మండపంలో జనసేన నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత కొత్తపేట సీటు కేటాయింపు విషయంలో ముఖ్య నాయకులు అభిప్రాయాలు వెల్లడించారు. ఆ సమయంలో జనసైనికులు ఒక్కసారిగా కేకలు, అరుపులతో గందరగోళం సృష్టించారు. దీంతో ఇన్‌చార్జి శ్రీనివాస్ కలుగజేసుకుని వారిని శాంతింపచేసి మాట్లాడారు. రాజమహేంద్రవరంలో పవన్‌ను కలిసినప్పుడు కొత్తపేట సీటు జనసేనకు కేటాయిస్తాం... దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోమని చెప్పారన్నారు. అయితే తాజాగా టీడీపీకి కేటాయించారన్నారు. టీడీపీకి సీటు కేటాయించిన అనంతరం జనసైనికులు పలు విమర్శలకు గురయ్యారన్నారు. గత ఎన్నికల్లో కొత్తపేట నుంచి జనసేన తరపున పోటీ చేసి రాష్ట్రంలోనే అత్యధిక ఓట్లు తెచ్చుకున్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. అధినేత నిర్ణయం వచ్చే వరకు వేచి చూద్దామన్నారు. ఆయన నిర్ణయానికి అనుగుణంగా జనసైనికుల అభీష్టం మేరకు ఏం చేయాలనే అంశంపై ఆలోచిద్దామన్నారు. ఈలోపుగా జనసైనికులపై, పార్టీపై బురద జల్లేందుకు ఎవరు ప్రయత్నించినా సమన్వయం పాటించాలన్నారు. పవన్‌ను విమర్శించడం కానీ, జనసైనికులు భావోద్వేగానికి గురవ్వడం కానీ, ఫ్లెక్సీలను చింపడం గానీ చేయవద్దన్నారు. నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

లీలాకృష్ణ నిర్ణయం మేరకు పనిచేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

మండపేట, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుకు తమ మద్దతు ఇవ్వబోమని జనసైనికులు స్పష్టం చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సరాకులు అబ్బులు, పార్టీ మండల అధ్యక్షుడు కుంచే ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి దాలపర్తి శ్రీనివాస్ మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలను పోలీసుస్టేషన్‌లో పెట్టినపుడు ఎమ్మెల్యే వేగుళ్ల పట్టించుకోక పోవడంతో తమ నాయకుడు లీలాకృష్ణ స్టేషన్ నుంచి వారిని బయటకు తీసుకువచ్చారని వారు చెప్పారు. ఆర్థికంగా బలవంతుడనే జోగేశ్వరరావుకు సీటు ఇచ్చారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ నిర్ణయం మేరకు పనిచేస్తామని వారు చెప్పారు. త్వరలో లీలాకృష్ణ సమావేశం నిర్వహించిన అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామని వారు వెల్లడించారు. జనసేన నాయకులు నామాల చంద్రరావు పాల్గొన్నారు.

జనసైనికులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ

మండపేట, ఫిబ్రవరి 25: జనసైనికుల మాటే తన మాటని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ చెప్పారు. త్వరలో నియోజకవర్గంలోని జనసైనికులతో సమావేశం నిర్వహించి వారి సూచనలు, సలహాలు తీసు కున్న తర్వాత భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. జన సైనికులు ఎవరూ అసహనానికి గురికావద్దన్నారు.

వెంకన్న ఆదాయం రూ.8.05లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.8,05,949 లభించినట్టు ఈవో బి.కిషోర్‌కుమార్ తెలిపారు. వెంకన్న ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి సత్తుపల్లికి చెందిన లింగాల వెంకటరమేష్ రూ.50,116 విరాళం సమర్పించారు.

యానాంలో వ్యవసాయశాఖ మంత్రి పర్యటన

యానాం, ఫిబ్రవరి 25: పుదుచ్చేరికి చెందిన వ్యవసాయశాఖ మంత్రి తేనే జయకుమార్ రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వచ్చారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాదరాజు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనం తరం రూ.40లక్షలు రుడా నిధులతో ఆలయ ఎదురుగా కోనేరు నాలుగు వైపులా విద్యుత్ దీపాల ఏర్పాటుకు నిధులు మంజూరు కావడంతో ఈపనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ


ముంగండ శ్రీముత్యాలమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠలో శిఖరంపై దృశ్యం

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: ముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ముగిసాయి. అమ్మవారికి యంత్రస్థాపన, విగ్రహపతిష్ఠ, పూర్ణాహుతి, ఆచార్యపూజ, ప్రతిష్ఠా ఫలస్వీకరణం, అగ్ని ప్రదిక్షిణాదికం, ప్రాణప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ముంగండ-కె.ముంజవరం రహదారి జనసంద్రంగా మారింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఆలయకమిటీ సభ్యులు ఇబ్బందులు పడ్డారు.

అయినవారు ఎవరూ రాక..
మృతదేహాన్ని మార్చురీకి చేర్చిన పోలీసులు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25: అయినవారు ఎవరూ రాకపోవడంతో అమలాపురం శ్రీలలితా థియేటర్ సమీపంలో శనివారం రాత్రి మృతి చెందిన దోనిపాటి సత్యనారాయణ(58) మృతదేహాన్ని పట్టణ పోలీసులు ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి లలితా థియేటర్ సమీపంలో భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. ఏం అనారోగ్యముందో తెలియదు. తెల్లారేసరికి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వద్దనున్న బ్యాగులో ఆధార్ కార్డు లభించడంతో వివరాలు తెలిసాయి. సెల్‌ఫోను, ఆధార్ కార్డు ఆధారంగా అయినాపురంలోని అతని బంధువర్గీయులకు పోలీసులు సమాచారం అందించారు. ఏ ఒక్కరూ రాకపోవడంతో మధ్యాహ్నం వేళ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్టు పట్టణ సీఐ కె.క్రిష్టఫర్ తెలిపారు.

తాళ్లరేవు ఎంపీపీ వ్యాఖ్యలపై ఖండన

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25: ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌పై తాళ్లరేవ ఎంపీపీ రాయుడు సునీత, ఆమె భర్త గంగాధర్ చేసిన వ్యాఖ్యలను హితకారిణి సమాజ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాశి బాలమునికుమారి ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తాళ్లరేవు ఎంపీపీ స్థానం జనరల్ కేటగిరికి కేటాయించినా ఎస్సీ మహిళలకు ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే పొన్నాడదేనన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంసీ డైరెక్టర్ నల్లా బేబిజానకి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ పెయ్యల భూలక్ష్మి, నాతి అలివేణి, మోకా చంద్రనాగరత్నం, తిరుకోటి శాంతిసుధ, పి.శాంతకుమారి, మందపాటి మహాలక్ష్మి, చెల్లి భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఇళ్లస్థలాల పత్రాలు పంపిణీ

పి.గన్నవరం, ఫిబ్రవరి 25: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పి.గన్నవరానికి చెందిన 283మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం అందించారు. తహసీల్దార్ ఎస్‌కే హుస్సేన్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాగ నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, వీఆర్వో తోట శ్రీను పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో తహసీల్దారు జె.విమలకుమారి అధ్యక్షతన ఆదివారం కార్యక్రమంలో మహిళలకు 1,220 ఇళ్లస్థలాల పట్టాలను అందించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వీకే రావు, వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నాయకులు దొమ్మేటి సత్యమోహన్, నేతల నాగరాజు, నాగవరపు నాగరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానంలో టీడీపీలో భారీగా చేరికలు



ఆలమూరు, ఫిబ్రవరి25: మూలస్థాన అగ్రహారంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో భారీగా టీడీపీలో చేశారు. పార్టీలో చేరిన మహిళలు, పలువురు వర్గాలకు చెందిన నాయకులకు బండారు కండువాలు వేసి పార్టీలోకి స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు కొత్తపేటతో పాటు రాష్ట్రంలో విజయం సాధిస్తుందని పలువురు నాయకులు నినాదాలు చేశారు. అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

రామచంద్రపురం, ఫిబ్రవరి 25: బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆదేశాలతో రామచంద్ర పురానికి చెందిన యాండ్ర బుల్లబ్బులను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. బీజేపీ అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రేడర్స్ సెల్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, ఖండవిల్లి సత్యన్నారాయణ బుల్లబ్బులను సత్కరించారు.

గ్రూప్ - 2 అభ్యర్థులతో కిక్కిరిసిన ఫెర్రీ రేవు

కె.గంగవరం, ఫ్రిబవరి 25: గ్రూప్ 2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులతో కోటిపల్లి ఫెర్రీరేవు ఆదివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి అమలాపురంలో పరీక్ష రాసేందుకు వెళ్లే అభ్యర్థులతో కోటిపల్లి వైపున, రామచంద్రపురంలో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులతో ముక్తేశ్వరం వైపున విపరీతమైన రద్దీ కొనసాగింది. రేవు దాటే వారు ఎక్కువ అవడంతో పరీక్ష సమయం దాటిపోతుందని అభ్యర్థులు ఆందోళన చెందారు. అయితే కొంత మంది సమయం మించిపోవడంతో వెనుతిరిగి పోయినట్లు సమాచారం.

బాలబాలాజీ ఆదాయం రూ.1,76,066

మామిడికుదురు, ఫిబ్రవరి 25: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఒకరోజు రూ.1,76,066 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. స్వామివారిని ఆదివారం 3,185మంది దర్శించుకుని 2,169 మంది అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మల్లాడిని కలిసిన నాయకులు


మల్లాడిని సత్కరిస్తున్న ముమ్మిడివరం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల

యానాం, ఫిబ్రవరి 25: పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును ఆదివారం పలువురు నాయకులు కలిశారు. వైసీపీ రామచంద్రపురం అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ తన తండ్రి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తో వచ్చి మల్లాడిని మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో విజయానికి పూర్తి సహకారం అందిస్తామని మల్లాడి హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ, జనసేన ముమ్మిడివరం అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు మల్లాడిని తన స్వగ్రహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎన్నికల్లో సహకారం అందించాలని మల్లాడిని కోరారు. మల్లాడి శిష్యుడు, జనసేన నాయకుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ మల్లాడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వివిధ అంశాలపై ఇద్దరు చర్చించుకున్నారు.

బీజేపీ జిల్లా కన్వీనర్‌గా సుంకర



కాట్రేనికోన, ఫిబ్రవరి 25: బీజేపీ జిల్లా కన్వీనర్‌గా సుంకర నాగేశ్వరరావు నియమితులయ్యారు. కాట్రేనికోనలో పార్టీ మండల అధ్యక్షుడు మట్ట సూరిబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఈమేరకు ప్రకటన చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా, జోనల్ ఇన్‌చార్జి సాయివిశ్వాస్, గ్రంధి నానాజీ, ఇళ్ళ వెంకటేశ్వరరావు, మోకా వెంకటసుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, గొలకోటి వెంకటరెడ్డి, చీకురుమెల్లి శ్రీనివాసరావు, డి.రాజేష్, సుంకర సాయి, కోట సత్యప్రసాద్, గ్రంధి నానిబాబు, ఆణివిళ్ళ సాయిబాబా పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమ, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్ అన్నారు. కముజువారిలంకలో దళిత రచ్చబండ కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మోదీ పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ కొల్లి సూర్యారావు, బొక్కా బాబూరావు, చెరుకూరి గోపాలకృష్ణ, పితాని శ్రీనివాస్, గంటి, రాంబాబు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు పార్కు ప్రారంభం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 25: ఆత్రేయపురం పంచాయతీ చెరువులో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్క్‌ను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాదరాజు ప్రారంభించారు. అనంతరం పార్క్‌లో నిర్మించిన సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొని అల్లూరి త్యాగాలను ప్రజలకు వివరించారు. అల్లూరి పేరుతో నిర్మించిన పార్క్‌ను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. క్షత్రియ ప్రముఖులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా చౌకడిపో డీలర్ల సమావేశం

మలికిపురం, ఫిబ్రవరి 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చౌక డిపో డీలర్ల సమావేశం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో సోమవారం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు అడపా వెంకటరమణ తెలిపారు. సమావేశానికి రాష్ట్ర డీలర్ల సంఘ అధ్యక్షుడు డి.లీలామాధవరావు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని, డీలర్లంతా మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలన్నారు.

నామన రాంబాబుకు సతీవియోగం



మామిడికుదురు, ఫిబ్రవరి 25: టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ టుమెన్ కమిటీ నామన రాంబాబు సతీమణి కృష్ణవేణి ఆదివారం మృతిచెందారు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో ఆదివారం కృష్ణవేణి మృతిచెందడంతో ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామం మగటపల్లి తీసుకువచ్చారు. వారి కుమారుడు నామన వినోద్ అమెరికాలో ఉండడంతో ఆయన వచ్చిన తరువాత అంత్యక్రియలు మంగళవారం మగటపల్లిలో నిర్వహిస్తారని బంధువులు తెలిపారు. రాంబాబును మాజీ సీఎం, టీడీజీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కె.గంగవరం, ఫిబ్రవరి 25: బాలాంత్రంలో ఒక మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. శనివారం రాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి బాలాంత్రంలో రోడ్డు ప్రక్కన కిరాణా షాపు నిర్వహిస్తున్న మేడిశెట్టి దుర్గ మెడలో రెండున్నర కాసుల బంగారు గొలుసును దొంగిలించుకుని యానాం వైపు వెళ్లిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పామర్రు ఎస్ఐ జానీ బాషా వివరించారు.

మోడరన్ ఫౌండేషన్ ద్వారా వీల్‌చైర్స్ అందజేత

రామచంద్రపురం, ఫిబ్రవరి 25: ప్రముఖ విద్యావేత్త డా. గరికపాటి రుద్రయ్య చౌదరి వర్ధంతి సందర్భంగా మోడరన్ ఫౌండేషన్ ద్వారా ఎన్నికల సమయంలో సీనియర్ సిటిజెన్స్, ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల సౌకర్యార్థం ఉపయోగించే ఎనిమిది వీల్ చైర్స్‌ను మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జి.వి.రావు ఆర్డీవో ఎస్.సుధాసాగర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులకు స్థానిక మోడరన్ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో మోడరన్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శించిన ఆర్యవర్ధన్

అమలాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన 'జీ తెలుగు' మేనేజరు బాలు తండ్రి ఇటీవల మృతి చెందారు. సౌత్ ఇండియన్ ఫ్రీక్స్ అధినేత శ్రీరామ్‌వెంకట్ (ఆర్యవర్ధన్)తో పాటు సినీ నటులు గుర్రం రామకృష్ణ, గనిశెట్టి రమణలాల్, కల్యకొలను మూర్తి తదితరులు బాలును ఆదివారం పరామర్శించారు.


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం